



బేనీషా కాయల వేలం నిర్వహిస్తున్న మండీ యజమాని

మామిడి సీజన్ ముగుస్తుండటంతో..

పెరిగిన కాయల ధరలు

టన్ను తోతాపురి రకం రూ.7వేలు, కవర్ బేనీషా రూ.79వేలు పలికాయి

బంగారుపాళ్యం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మామిడి సీజన్ ముగుస్తుండటంతో కాయల ధరలు పెరుగుతున్నాయి. ఆదివారం ర్యాంపులు, మండీల వద్ద గుజ్జుపరిశ్రమకు తరలించే తోతాపురి రకం టన్ను రూ.7వేలు పలికింది. టేబుల్ రకాలైన కవర్ బేనీషా టన్ను రూ.79వేలు, కవరు కట్టని రకం రూ.25-48వేల వరకు ధర పలికాయి. కవరు కట్టిన తోతాపురి టన్ను రూ.12-23వేల వరకు, నీలం రకం టన్ను రూ.10-30వేల వరకు అమ్ముడుపోయాయి.

పొరుగు రాష్ట్రాలకు చెందిన పల్ప్ కంపెనీల కొనుగోళ్లు



పలమనేరులో మామిడి కాయలను తూకం వేసుకోవడానికి ఆగి ఉన్న ట్రాక్టర్లు

పలమనేరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పలమనేరు వద్ద ఏర్పాటు చేసిన ర్యాంపుల వద్దకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలు పల్ప్ కంపెనీలు, వ్యాపారులు తరలివస్తున్నారు. వీరు నాలుగు రోజుల కిందట వరకు కిలో కేవలం రూ.6 వరకు కొనుగోలు చేస్తుండగా, ప్రస్తుతం కిలో రూ.7 వరకు ఇస్తున్నారు. దీనివల్ల పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె, వి.కోట మండలాల్లోని మామిడి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీలో మార్పు

అధ్యక్షుడికా? ప్రధాన కార్యదర్శికా?

- ఈసారి పార్లమెంటు అధ్యక్షుడా.. జిల్లా అధ్యక్షుడా..?
- పెద్దఎత్తున పోటీ పడుతున్న ఆశావహులు

చిత్తూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యేకు మించి దాదాపు మంత్రి హోదాను అనుభవిస్తూ ఉంటారు. అమరనాథరెడ్డి, పులివర్తి నాని, గౌనివారి శ్రీనివాసులు.. ఇలా చాలా మంది అధికార పార్టీ జిల్లా అధ్యక్షులుగా పనిచేసే ఓ వెలుగు వెలిగారు. ఇప్పటికే గ్రామ, మండల కమిటీ ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో.. నాలుగైదు రోజుల్లో జిల్లా కమిటీ ఎన్నికల్నీ పూర్తి చేయాలని అధిష్ఠానం నిర్దేశించింది. జిల్లా ప్రాతిపదికగా అధ్యక్షులు ఉంటారా లేక ఇప్పుడున్నట్లుగానే పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు ఉంటారా అనే స్పష్టతలేదు.అయినా ఆశావహుల జాబితా మాత్రం చాలానే ఉంది.

జిల్లా ప్రాతిపదికనేనా?

ప్రస్తుతం టీడీపీ పార్లమెంటు నియోజకవర్గాలకు అధ్యక్షులున్నారు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడిగా చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శిగా పూతలపట్టు నియోజకవర్గానికి చెందిన కోదండయాదవ్ ఉన్నారు. అయితే చిత్తూరు పార్లమెంటులోని చంద్రగిరి తిరుపతి జిల్లాలో ఉండడం, నగరి కూడా సగం తిరుపతిలోనే ఉండడం, పుంగనూరును అన్నమయ్య జిల్లాలోకి కలిపే ప్రతిపాదనలు ఉండడం.. వంటి కారణాలతో ఈసారి జిల్లాను ప్రాతిపదికన నియమించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం ఇద్దరూ బీసీలే

ప్రస్తుతం ఉన్న అధ్యక్ష కార్యదర్శులు ఇద్దరూ బీసీలే. అధ్యక్షుడు సీఆర్ రాజన్‌కు రాష్ట్ర వన్నియకుల క్షత్రియ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవి కూడా లభించింది. ఇక కోదండయాదవ్ చాలాకాలంగా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈ ఇద్దరిలో ఒకర్ని ఖచ్చితంగా మార్చే అవకాశాలున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఓసీ ఒకరు, బీసీ మరొకరు ఉంటారని అంటున్నారు. సీఆర్ రాజన్‌కు ఇప్పటికే పదవి ఇచ్చారు కాబట్టి, పార్టీ అధ్యక్షుడిగా వేరేవారికి అవకాశం ఇస్తారా అనేది తెలియాల్సి ఉంది. ఒకవేళ జిల్లా ప్రాతిపదికన అధ్యక్షుడిని ఎంపిక చేస్తే సీఆర్ రాజన్ తిరుపతి పరిధిలోకి వెళ్లిపోతారు.

ఆశావహుల జాబితా పెద్దదే..

చిత్తూరు రూరల్ మండలానికి చెందిన మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి భర్త చంద్రప్రకాష్ అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. బంగారుపాళ్యానికి చెందిన ఎన్‌పీ జయప్రకాష్ అధ్యక్ష పదవి కోరుతున్నా, వీలుకాకపోతే ప్రధాన కార్యదర్శి అయినా పర్లేదని భావిస్తున్నారని చెబుతున్నారు. డీసీసీబీ అధ్యక్ష పదవి ఆశించిన ఈయనకు ఏదో ఒక పదవి ఇస్తారనే ప్రచారం ఉంది. ఇక మంత్రి అచ్చెన్నాయుడి అండతో నగరికి చెందిన విజయ్‌బాబు కూడా అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారని అంటున్నారు. జీడీనెల్లూరు నియోజకవర్గ మాజీ కోఆర్డినేటర్ భీమినేని చిట్టిబాబు, ఐరాల మండల అధ్యక్షుడు గిరి, తవణంపల్లెకు చెందిన వెంకటేష్ చౌదరి పేర్లు కూడా అధ్యక్ష, కార్యదర్శి పదవుల ఆశావహుల్లో ఉన్నాయి. జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్న కాజూరు బాలాజీ కూడా జిల్లా అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. ఇక జిల్లా అధ్యక్షుడ్ని మార్చిన ప్రతిసారీ జిల్లా యువత అధ్యక్షుడ్ని కూడా మార్చుతూ వస్తున్నారు. ప్రస్తుతం యువత అధ్యక్షుడిగా ఉన్న కాజూరు రాజేష్ కొనసాగుతారా.. లేదా.. అనేది జిల్లా అధ్యక్షుడి మార్పు మీద ఆధారపడి ఉంటుంది.

రెండు, మూడ్రోజుల్లో నామినేటెడ్ పదవులూ..

జిల్లా కేంద్రంలోని మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి మాపాక్షికి చెందిన వెంకటేష్ యాదవ్ పేరు ఖరారు అయినా, రిజర్వేషన్లలో భాగంగా మహిళలకు కేటాయించడంతో వెంకటేష్ యాదవ్ సతీమణికి చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించనున్నారని అంటున్నారు. అలాగే ఎన్నికల్లో క్లస్టర్ ఇన్‌చార్జిగా పనిచేసిన త్యాగరాజన్‌కు రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఖరారైందని చెబుతున్నారు. వీటితోపాటు గ్రంథాలయ చైర్మన్, కోఆపరేటివ్ ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ పదవుల్నీ కూడా భర్తీ చేస్తారని తెలుస్తోంది.

నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను తీసుకుంటామన్నారు. జిల్లా అధికారులందరూ విధిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆదేశాలిచ్చారు. అలాగే డివిజన్, మండల స్థాయిల్లోనూ అధికారులు పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించాలన్నారు.

- జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిరాశ్రయుల వసతి గృహంలో తనిఖీలు



వృద్ధురాలికి దుస్తులు పంపిణీ చేస్తున్న తేజ్ భరత్

చిత్తూరు అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నిరాశ్రయుల వసతి గృహంలో పేదలకు మెప్మా తరఫున సహకారం అందిస్తామని మెప్మా మిషన్ రాష్ట్ర డైరెక్టర్ తేజ్ భరత్ తెలిపారు. ఆదివారం చిత్తూరులోని నిరాశ్రయుల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వంటశాలలో ఆహార పదార్థాల తయారీని, నిరాశ్రయుల రికార్డులను పరిశీలించారు. అనంతరం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసతి గృహంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఎస్ఎంఎం శ్రీనివాసరావు, చిత్తూరు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్ర, సీఎంఎం వెంకటరమణ, సపోర్టు సంస్థ నిర్వాహకులు జోసఫ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రైలు దోపిడీ ముఠా పట్టివేత

- **నేడు అరెస్టు చూపించనున్న రైల్వే పోలీసులు**

చిత్తూరు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని సిద్ధంపల్లె రైల్వేస్టేషన్‌కు సమీపంలో జరిగిన రైలు దోపిడీ ముఠాను రైల్వే పోలీసులు పట్టుకున్నారు. జూన్ 26వ తేదీన సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి దుండగులు రైలు ఆపేశారు. ఆపై రైలులోని ముగ్గురు మహిళల మెడల్లో నుంచి సుమారు 50 గ్రాములకుపైగా బంగారాన్ని దోచుకెళ్లారు. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న రైల్వే పోలీసులు ఈ ముఠాను పట్టుకున్నారు. సోమవారం అరెస్టు చూపించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

రిజిస్ట్రేషన్ శాఖలో సంస్కరణలు

రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం ప్రజోపయోగ సంస్కరణలు తీసుకొస్తోంది. ఇప్పటికే అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభించిన స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ సత్ఫలితాలు ఇచ్చింది. క్రయ, విక్రయదారులు ఎలాంటి నిరీక్షణ లేకుండా ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. తాజాగా వారసత్వ ఆస్తుల డాక్యుమెంటేషన్‌పై త్వరలోనే మార్గదర్శకాలు జారీ చేయనుంది.

- చిత్తూరు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

వారసత్వ ఆస్తుల డాక్యుమెంటేషన్‌పై త్వరలోనే మార్గదర్శకాలు

ఆస్తి యజమాని మరణించాక వారసులకు సంక్రమించే వాటికి మాత్రమే గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తారు. మిగిలిన వాటికి యథావిధిగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. తల్లిదండ్రులు మరణించాక వారసత్వంగా వచ్చే ఆస్తుల మ్యుటేషన్లు (భూముల రికార్డుల్లో వివరాలు నమోదు) సకాలంలో జరగడంలేదని.. తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది తిప్పుకుంటున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. మరోవైపు తమ ఆస్తికి రిజిస్ట్రేషన్ ఎందుకు అన్న అపోహతో కొందరు దూరంగా ఉంటున్నారు. దీనివల్ల మృతి చెందినవారి పేర్లే రికార్డుల్లో ఉండిపోతున్నాయి. ఫలితంగా పలు సమస్యలు తలెత్తుతున్నాయి.

మరింత సులువు

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిర్ధారించిన మార్కెట్ విలువ ప్రకారం సదరు ఆస్తి విలువ రూ.10 లక్షల్లోపు ఉంటే రూ.100, ఆపైన ఉంటే రూ.వెయ్యి.. స్టాంపుడ్యూటీగా తీసుకుంటారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా మరణ ధ్రువీకరణ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయి. యజమాని మరణించాక వచ్చిన ఆస్తులను వారసులు భాగాలు చేసుకుని లిఖితపూర్వకంగా ఏకాభిప్రాయంతో వస్తే సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు రిజిస్ట్రేషన్ చేస్తారు. రిజిస్ట్రేషన్లు చేయడం వల్ల మ్యుటేషన్ ఆటోమేటిక్‌గా జరుగుతుంది. ఈ-పాస్‌బుక్ కూడా జారీ అవుతుంది. వారసులుగా ఉన్నవారి నుంచి ఈకేవైసీ తీసుకుంటారు.



సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు

కలెక్టర్ నేతృత్వంలోని కమిటీకి రద్దుచేసే అధికారం

రిజిస్ట్రేషన్లు అక్రమ పద్ధతుల్లో జరిగితే వాటిని రద్దు చేసే అధికారాన్ని కలెక్టర్ నేతృత్వంలోని ప్రత్యేక కమిటీకి దాఖలు చేస్తూ ప్రభుత్వం ప్రకటన జారీచేసింది. రిజిస్ట్రేషన్ అక్రమంగా జరిగినట్లు ఫిర్యాదు అందితే జిల్లా రిజిస్ట్రార్ వాటిని పరిశీలిస్తారు. ఆధారాల ప్రాతిపదికన కమిటీకి సిఫార్సు చేస్తారు. ఆధారాలు పరిశీలించాక, అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దుచేసే అవకాశం ఉంది.



బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

అదుపుతప్పి బోల్తాపడి.. దగ్ధమైన కారు - చిన్నారిసహా ఆరుగురిని కాపాడిన స్థానికులు

బంగారుపాళ్యం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఓ కారు అదుపు తప్పి బోల్తాపడింది. అందులోని చిన్నారిసహా ఆరుగురిని స్థానికులు కాపాడారు. ఆపై కారులో మంటలు చెలరేగడంతో దగ్ధమైంది. త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం కాంచీపురానికి చెందిన తాండవమూర్తికి పక్షవాతం బారినపడ్డాడు. దాంతో తాండవమూర్తిని తీసుకుని ఆయన కుమారుడు కార్తికేయ తన కుటుంబీకులైన సంపత్ కుమారి, వేలాయుధం, అశ్విని, ఏడాదిన్నర వయస్సు ఉన్న రక్షితతో కలిసి శనివారం రాత్రి కారులో పలమనేరు సమీపంలోని విరూపాక్షపురానికి వచ్చారు. అక్కడ వైద్యం చేయించుకుని ఆదివారం ఉదయం తిరిగి కాంచీపురానికి బయల్దేరారు. మార్గమధ్యంలో చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై బంగారుపాళ్యం మండలం పాలేరు సమీపంలోని లక్కీ డాబా ఎదురుగా కారు అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడి కొంత దూరం జారుకుంటూ వెళ్లి ఆగింది. ఈ రాపిడికి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే వాహనంలోని ఆరుగురినీ బయటకు తీశారు. ఆ తర్వాత మంటలు అధికమై వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో చిన్నారికి తప్ప మిగిలినవారికి స్వల్పగాయాలవడంతో 108 అంబులెన్స్‌లో బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో జనసంచారం ఉండటం వల్లే కారులోని వారు ప్రాణాలతో బయటపడ్డారని స్థానికులు తెలిపారు.



మంటల్లో కారు (ఇన్‌సెట్లో) పూర్తిగా దగ్ధమయ్యాక..

న్యాయం జరిగే వరకు పోరాటం

- రాయుడి సోదరి కీర్తి ఆవేదన.. స్పష్టీకరణ
- మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి
- వినుత దంపతులతోపాటు మరో ముగ్గురికి 14 రోజుల రిమాండ్



శ్రీనివాసులు మృతదేహం వద్ద విలపిస్తున్న సోదరి కీర్తి (ఇన్‌సెట్లో) ఫైల్‌ఫొటో

శ్రీకాళహస్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మా అన్న రాయుడు (శ్రీనివాసులు) హత్యకేసులో న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని కీర్తి ఆవేదనా స్వరంతో చెప్పారు. శ్రీకాళహస్తి మండలం బొక్కిసంపాళెనికి ఆదివారం చెన్నైనుంచి మృతదేహం రాగానే అమ్మమ్మ రాజేశ్వరి, సోదరితోపాటు బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. కీర్తి విలపిస్తూ, మాట్లాడారు. 'జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను ప్రాణం కన్నా ఎక్కువగా మా అన్న అభిమానించేవాడు. ఎన్నో సంవత్సరాల నుంచి జనసేన ఇన్‌చార్జి వినుత దంపతుల వద్ద అహర్నిశలు శ్రమిస్తూ వారిఉన్నతి కోసమే తపించేవాడు. ఇటీవల మా అన్న కాలు జారిపడటంతో గాయమైందని వినుత దంపతులు మాకు ఫోన్ ద్వారా చెప్పారు. మేము ఇంటికి వెళ్లి చూడటంతో కాలికి గాయమైంది. మా అన్న శ్రీనివాసులుకు రెండువైపులా ఇద్దరు కూర్చుని మాట్లాడనీయకుండా కట్టడి చేశారు. మా వ్యక్తిగత విషయాలను రాజకీయ ప్రత్యర్థులకు మీ అన్న చెరవేస్తున్నాడంటూ వినుత దంపతులు మాకు చెప్పారు. తర్వాత మళ్లీ విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించి ఇంటికిపంపేశారు. ఆ తరువాత కూడా చాలాసార్లు పిలిపించుకున్నారు. పని కోసం పిలుస్తున్నారని మేం అనుకున్నాం. కానీ చిత్రహింసలకు గురి చేసి హతమార్చేశారు. చెన్నై పోలీసులు చెప్పే వరకు మా అన్న చనిపోయాడన్న విషయం కూడా తెలియదు. వారిని కఠినంగా శిక్షించాలి' అంటూ కీర్తి కోరారు. కాగా, మృతదేహం రాక సమాచారం తెలుసుకున్న శ్రీనివాసులు అలియాస్ రాయుడు స్నేహితులు, బంధువులు బొక్కిసంపాళెం చేరుకుని ఘనంగా నివాళులు అర్పించారు. వైసీపీ నేత అంజూరు శ్రీనివాసులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. సాయంత్రం అంత్యక్రియలు పూర్తిచేశారు.

నిందితులకు 14రోజుల రిమాండ్

డ్రైవర్ శ్రీనివాసులును హత్య చేశారన్న కేసులో చెన్నైలోని సి3 సెవెన్ వెల్స్ పోలీసులు జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన మాజీ ఇన్‌చార్జి వినుతతోపాటు భర్త చంద్రబాబు, వారికి సహకరించిన శివకుమార్, గోపి, తస్సర్ బాషాను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి న్యాయమూర్తి ఎదుట వారిని చెన్నై పోలీసులు హాజరు పరచగా 14రోజుల పాటు రిమాండ్ విధించారు. చెన్నైలోని పుళల్ సెంట్రల్ జైలుకు వీరిని తరలించారు.





బోయకొండ గంగమ్మ - క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

బోయకొండ గంగమ్మకు రూ.28లక్షల ఆదాయం

ఈ ఏడాదిలో ఒక్కరోజులోనే ఇంత రావడం ఇదే ప్రథమం - అమ్మవారి సేవలో 40వేల మంది భక్తులు

చౌడేపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మకు వివిధ సేవా టిక్కెట్ల ద్వారా ఆదివారం ఒక్క రోజే రూ.28లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఏడాదిలో ఇంత ఆదాయం రావడం ఇదే ప్రథమమని ఈవో ఏకాంబరం తెలిపారు. వేకువ జాము నుంచే ఆలయం భక్తులతో పోటెత్తింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు క్యూలైన్లలో రద్దీ కొనసాగింది. సుమారు 40వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో పర్యవేక్షించారు.

స్టోన్ డస్ట్ ముసుగులో తమిళనాడుకు ఇసుక అక్రమ రవాణా
- ఏడు టిప్పర్ల సీజ్, ఏడుగురు డ్రైవర్ల అరెస్టు

కారును ఢీకొని ద్విచక్ర వాహనదారుడి దుర్మరణం
7లో

తూపిలిపాళెంలో హోయ్.. హోయ్



వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రతీరంలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలతో పాటు తిరుపతి నుంచి వచ్చిన పర్యాటకులతో తీరం కళకళలాడింది. పిల్లలు, యువత ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ నాగబాబు బందోబస్తు ఏర్పాటు చేశారు. - వాకాడు, ఆంధ్రజ్యోతి

వానరాలకు పండ్లు



భాకరాపేట ఘాట్‌కు రెండువైపులా వానరాలు గుంపులుగా చేరుతుంటాయి. తిండికోసం వచ్చీ పోయే వాహనాల వైపు ఆశగా ఎదురు చూస్తుంటాయి. దీనిని గమనించిన భాకరాపేట ఇటుకల బట్టీ యజమాని సిద్దరామిరెడ్డి వారంలో మూడు రోజులు బిస్కెట్లు, పండ్లు అందిస్తున్నారు. - భాకరాపేట, ఆంధ్రజ్యోతి

పట్టర ఓ పట్టు



అది చంద్రగిరి టవర్ క్లాక్ సమీపంలో ప్రభుత్వాస్పత్రికి వెళ్లే దారి. దీనికి అడ్డంగా ఉన్న కాలువపై ఇనుప రాడ్లతో జల్లెడలా వేయగా.. అది వంగిపోయింది. ఇలా ఆదివారం వారపు సంతకోసం కొందరు రైతులు కలిసి మినీ లారీలో కూరగాయలు వేసుకుని రాగా ఆగిపోయింది. దీంతో మహిళా రైతులూ తమ వంతు చేయి వేసి నెట్టడంతో ముందుకు కదిలింది. - చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు




తేజ్‌భరత్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు - విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేషసాయికి జ్ఞాపికను అందిస్తున్న డీఈవో సాగర్‌బాబు

ఐరాల(కాణిపాకం), జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని ఆదివారం మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్ దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామివారి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో సాగర్‌బాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీజేఏ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా శివకుమార్



చిత్తూరు అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ (ఏపీపీజేఏ) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం విజయవాడలో ఏపీపీజేఏ రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్న శివకుమార్‌ను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయిలో శివకుమార్‌కు స్థానం లభించడంపై చిత్తూరు ప్రెస్ కమిటీ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేసింది.

యాదమరి మండలంలో బాల్య వివాహం

యాదమరి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలంలో ఓ బాల్య వివాహం జరిగింది. యాదమరి మండలానికి చెందిన మచ్చా నవీన్ (31)కు అదే గ్రామానికి చెందిన బాలిక(16)తో పెళ్లి చేయాలని ఇరుకుటుంబాల వారు నిర్ణయించుకున్నారు. ఇది తెలియడంతో గ్రామ సచివాలయంలోని మహిళా సంరక్షణ కార్యదర్శి ఈనెల పదోతేదీన ఇరు కుటుంబాలను హెచ్చరించారు. అలాంటిదేమీ లేదని చెప్పిన బాలిక తల్లి ఆదివారం ఉదయం తిరుపతిలోని బంధువుల సమక్షంలో బాలికకు రహస్యంగా పెళ్లి చేసేశారు. అయితే ఈ పెళ్లి ఆపాలంటూ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు గ్రామస్తులు ఫోన్ల ద్వారా తెలియజేయారు. అధికారులు వచ్చేసరికి పెళ్లి జరిగిపోయింది. దాంతో సీడీపీవో వినుతశ్రీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళ, ఇతర అధికారులు బాలిక తల్లి వద్దకొచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు.

మధ్యంతర భృతి మంజూరు చేయాలి : ఎస్టీయూ



ఎస్టీయూ రాష్ట్ర నాయకులకు వినతిపత్రం ఇస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి

చిత్తూరు సెంట్రల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): టీచర్లకు మధ్యంతర భృతి (ఐఆర్)30 శాతం మంజూరు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కాకినాడలోని ఎస్టీయూ భవన్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ నిత్యావసర ధరలు పెరిగిన క్రమంలో పెండింగ్‌లోని డీఏ ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలను మంజూరు చేసి, నగదు జమ చేయాలని, రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు గతేడాది గ్రాట్యుటీ, అర్ధవేతన సెలవు నగదు, సరెండర్ లీవు బకాయిలు చెల్లించాలని కోరారు. జిల్లాలో స్పెషల్ ఎడ్యుకేషన్, వివిధ సబ్జెక్టు క్యాటగిరీలలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులను నెలవారీ పదోన్నతి పద్ధతిలో భర్తీచేయాలని, యాప్‌ల భారం తగ్గించాలని కోరారు. అనంతరం ఎస్టీయూ అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డిలకు వినతిపత్రం అందజేశారు.

స్టోన్ డస్ట్ ముసుగులో తమిళనాడుకు ఇసుక అక్రమ రవాణా

- ఏడు టిప్పర్ల సీజ్, ఏడుగురు డ్రైవర్ల అరెస్టు




తడుకుపేట వద్ద టిప్పర్లను ఆపి తనిఖీ చేస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు - నగరి డిగ్రీ కళాశాల వద్ద పట్టుబడిన ఇసుక టిప్పర్లు, డ్రైవర్లతో అధికారులు

నగరి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్టోన్ డస్ట్ ముసుగులో ఆంధ్రా నుంచి తమిళనాడుకు ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్న ఏడు టిప్పర్లను పోలీసులు, రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. నగరి సీఐ విక్రమ్, తహసీల్దార్ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు.. చెన్నైకి చెందిన భరత్.. నగరి మండల పరిధిలోని గుండ్రాజకుప్పం పంచాయతీలో ఉన్న వేల్ అండ్‌కో క్రషర్‌ను నిర్వహిస్తున్నాడు. ఇతను చెన్నైలోని కొందరు లారీ యజమానులతో పాటు నగరికి చెందిన మరికొందరితో కలిసి ఇసుక అక్రమ రవాణాకు పథకం పన్నాడు. అన్నమయ్య జిల్లా రాజంపేట నుంచి ఇసుకను టిప్పర్లలో తీసుకొచ్చి తన క్రషర్‌కు తరలించేవాడు. అక్కడ ఎవరికీ అనుమానం రాకుండా ఇసుకపై డస్ట్ వేసి తమిళనాడులోని చెన్నై, తిరువళ్లూరు తదితర ప్రాంతాలకు తరలించేవాడు. ఆదివారం ఉదయం 5.30 గంటలకు నగరి మండల పరిధిలోని తడుకుపేట వద్ద వరుసగా ఏడు టిప్పర్లు వెళుతుండడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు తనిఖీ చేసి ఇసుక బయటపడింది. దీంతో ఏడు టిప్పర్లను, ఏడుగురు డ్రైవర్లను అరెస్టు చేశారు. అరెస్టయినవారిలో తమిళనాడులోని కనకమ్మసత్రానికి చెందిన వి.జయకృష్ణ(38), కల్పకానికి చెందిన పాండ్యన్ (42), కల్లకురిచ్చికి చెందిన ఎ.అజిత్ కుమార్(29), పెరమాందూర్‌కు చెందిన ఎం.ప్రవీణ్‌కుమార్, కన్యాకుమారికి చెందిన ఎఎస్ శ్రీజిత్(26), తాంబరం నివాసి ఎస్.అశోక్(31), నగరి మండలం గుండ్రాజకుప్పానికి చెందిన దేవరాజులు ఉన్నారు. ప్రధాన నిందితుడిని భరత్‌ను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

గ్రూప్ 2 బ్యాక్‌లాగ్ పోస్టుల పేరిట రూ.85 లక్షల మోసం

- పోలీసులకూ ఫిర్యాదు
- చర్యల్లేకపోవడంతో మీడియాకెక్కిన బాధితులు

తిరుపతి(నేర విభాగం), జూలై 13 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించాల్సిన ఎంప్లాయిమెంట్ అధికారి.. ఉద్యోగాల పేరిట మోసం చేశారు. నిరుద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగుల నుంచీ రూ.85 లక్షల వరకు మోసం చేశారు. దీనిపై గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా.. ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు అంటున్నారు. పోలీసులేమో రెండు నెలల కిందట కేసు నమోదు చేశామని.. దర్యాప్తులో ఉందంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం బాధితులు మీడియాను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన ప్రకారం.. రెవెన్యూ విభాగంలో బ్యాక్‌లాగ్ (తహసీల్దారు, డీటీ, ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్) పోస్టులు ఇప్పిస్తామని తిరుపతి ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగినంటూ ఒకరు పరిచయం చేసుకున్నారు. ఒక్కొక్కరి వద్ద రూ.5 లక్షల నుంచి 20 లక్షల వరకు వసూలు చేశారు. తన పిన్ని, బాబాయ్‌ని, మంగళగిరిలో ఓ ఉన్నతాధికారిని కలుపుకొని ప్లాన్ ప్రకారం నిరుద్యోగుల నుంచి డబ్బు వసూలు చేశారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన రబ్బర్ స్టాంపులు, లెటర్ ప్యాడ్లు తయారు చేశారు. ఒప్పందం కుదిరిన అభ్యర్థులకు.. ప్రభుత్వ తరహాలో వారి ఇళ్ల వద్ద పరీక్షలు నిర్వహించారు. పరీక్షల తర్వాత ఖచ్చితంగా ఈ ఉద్యోగాలు రావాలంటే డబ్బులు చెల్లించాల్సిందేనని చెప్పి పూర్తి స్థాయిలో వసూలు చేశారు. ఆపై బోర్డు తిప్పేశారు. ఆ నలుగురిని బాధితులు ప్రశ్నించినా.. డబ్బులిచ్చేయమని బతిమలాడినా సమాధానం లేదు. చివరకు ఎదురు బెదిరింపులకు దిగినట్లు సమాచారం. దీంతో తిరుపతికి చెందిన దాదాపు 20 మందిలో 14 మంది బాధితులు ఎస్పీ హర్షవర్ధనరాజును కలిసి తమ గోడు చెప్పుకొన్నారు. రెండు నెలలవుతున్నా పోలీసుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో బాధితులు ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌కు వచ్చి మీడియాకు వివరించారు. సోమవారం కలెక్టర్‌ను కలవాలని భావిస్తున్నట్లు తెలిసింది.

కేసు దర్యాప్తులో ఉంది

ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేసిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు చెప్పారు. కాగా, బాధితులు ఎస్పీ హర్షవర్ధన రాజుకు ఫిర్యాదు చేశారు. ఆ వెంటనే ఆయన విచారించి కేసు నమోదు చేయాలని తిరుపతి డీఎస్పీ భక్తవత్సలంను మే 24న ఆదేశించారు. ఈ కేసు పరిధి తిరుపతి రూరల్‌కు సంబంధించి కావడంతో చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్‌కు ఆయన పంపారు. ఈ అంశాన్ని తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందుతో 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా, చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం యర్రమరాజుపల్లెకి చెందిన ఎ.రాధాకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు.. ఎంప్లాయిమెంట్ ఆఫీసులో ఉద్యోగినంటూ చెప్పిన పి.లక్ష్మితో పాటు పి.వేణుగోపాల్, పి.విద్య, హారికపై మే నెలలోనే కేసు నమోదు చేశామని.. దర్యాప్తు దశలో ఉందని సీఐ చెప్పారు.

ముక్కంటి క్షేత్రం భక్తజన సందోహం

శ్రీకాళహస్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తజనసంద్రంగా మారింది. వారాంతపు సెలవులు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కాణిపాకంలో నేడు సంకటహర గణపతి వ్రతం

ఐరాల(కాణిపాకం), జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో సోమవారం సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఈవో పెంచలకిషోర్ ఆదివారం తెలిపారు. పౌర్ణమి గడిచిన 4వ రోజున ఆలయ ఆస్థాన మండపంలో సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల వరకు వ్రతాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. వ్రతంలో నిర్వహించదతలచినవారు రూ.350 చెల్లించి పాల్గొనవచ్చన్నారు. రాత్రి ఏడు నుంచి ఎనిమిది గంటల మధ్యలో స్వర్ణ రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈనెల 22న ప్రధాన ఆలయానికి అనుబంధంగా ఉన్న మణికంఠేశ్వరాలయంలో సాయంత్ర ఐదు నుంచి ఆరు గంటల మధ్య ప్రదోష కాల పూజలు జరుగుతాయన్నారు.

కారును ఢీకొని ద్విచక్ర వాహనదారుడి దుర్మరణం



మృతి చెందిన చంద్రమౌళి

తవణంపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కారును ఢీకొని ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం చెందాడు. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. పాకాల మండలం దామల చెరువుకు చెందిన చిన్నమునెయ్య కుమారుడు చంద్రమౌళి(34) తవణంపల్లెకు ఆదివారం ద్విచక్రవాహనంలో వచ్చాడు. మధ్యాహ్నం తిరుగు ప్రయాణంలో తిరుపతి -బెంగళూరు హైవేపై తవణంపల్లె మండలంలోని నత్తపుసేను సమీపంలోకొచ్చేసరికి తిరుపతి నుంచి తమిళనాడులోని బంగారు గుడికి వెళుతున్న కారును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు శ్రీవారికి పరదాల సమర్పణ



సిద్ధం చేసిన పరదాలు

తిరుపతి(ఆటోనగర్), జూలై13(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన వాసు టైలర్స్ అధినేత మేకల సుబ్రమణ్యం(మణి) తిరుమల శ్రీవారికి సమర్పించేందుకు మూడు తెరలను(పరదాలు) సిద్ధం చేశారు. వాటిని సోమవారం సాయంత్రం తిరుమలలో టీటీడీ అధికారులకు అందించనున్నారు. ఉగాది ఆస్థానం, ఆణివారి ఆస్థానం, సాలకట్ల బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల కోసం మూడు చొప్పున ప్రత్యేక పరదాలను తయారు చేస్తారు. ఒకరోజు ముందు కాలి నడకన తిరుమలకు చేరుకుని పుష్కరిణిలో స్నానమాచరించి, వరాహస్వామిని దర్శించుకున్న అనంతరం ఆలయాధికారులకు అందజేస్తామని మణి తెలిపారు. 27 ఏళ్లుగా పరదాలు సమర్పిస్తున్నట్లు చెప్పారు.

తిరుమలలో భక్తుల రద్దీ



రింగురోడ్డులోని క్యూలైన్‌లో సర్వదర్శన భక్తులు

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. గురువారం సాయంత్రం నుంచి తిరుమలకు భక్తుల తాకిడి పెరిగిన విషయం తెలిసిందే. శుక్ర, శనివారాల తరహాలోనే ఆదివారం కూడా భక్తులతో తిరుమల కొండ కిటకిటలాడింది. సాధారణంగా ఆదివారం సాయంత్రానికి వారాంతపు రద్దీ తగ్గుతుంది. కానీ ఆదివారం రాత్రి 9 గంటలైనా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్టుమెంట్లతో పాటు నారాయణగిరి పార్కులోని తొమ్మిది షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు క్యూలైన్ వ్యాపించింది. వీరికి దాదాపు 16 గంటల తర్వాత దర్శన సమయం పడుతోంది. క్యూలైన్‌లో చేరే భక్తుల సంఖ్య కొనసాగుతునే ఉన్న క్రమంలో సాయంత్రానికి కల్యాణవేదిక వద్ద క్యూలైన్ మూసివేశారు. రద్దీ అధికంగా ఉన్న క్రమంలో సోమవారం ఉదయం 6 గంటలకు క్యూలైన్‌లోకి ప్రవేశించాలని ప్రకటనలు చేస్తున్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

ప్రభుత్వ పాలిటెక్నిక్ అభివృద్ధికి తోడ్పాటు

● పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో విద్యార్థుల హామీ


అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

కుప్పం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తాము చదివిన ప్రభుత్వ పాలిటెక్నిక్ అభివృద్ధికి భవిష్యత్తులో తోడ్పాటునందిస్తామని పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారు. కుప్పంలోని వైసీ జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకున్న 2005-2008 సంవత్సర బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కళాశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తాము కలాశాలలో చదివిన నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పట్లో వైసీ జేమ్స్ యెన్ రూరల్ పాలిటెక్నిక్ కళాశాలగా ఉండేదని, 2014లో ప్రభుత్వ పరం అయిన తర్వాత కళాశాల పేరు వైసీ జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అయిందని నాటి విద్యార్థులు తెలిపారు. తమ బ్యాచ్‌లో 90 మంది విద్యార్థులు ఉండేవారన్నారు. ఆనాటి గురువులు తమ వెన్ను తట్టి, చదువుల్లో ప్రోత్సహించడంతో నేడు ఉన్నత స్థితికి ఎదగగలిగామని చెప్పారు. తాము చదివిన కళాశాలకు ఎన్‌బీయే గుర్తింపు రావడం ఎంతో గర్వంగానూ, సంతోషంగానూ ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావు, ఈసీఈ విభాగాధిపతి రామకృష్ణారావు, అధ్యాపకులు జీఎస్.రమేశ్, షణ్ముగం, వెంకటరమణన్, మహేశ్, ప్రవీణ్, శిరీష, పూర్వవిద్యార్థులు ఐటీడీపీ సభ్యుడు వినోద్‌కుమార్, రుద్రయ్య, శబరీశ్, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం


పెద్దూరులో బోరు తవ్వకంలో టీడీపీ నేతలు

రామకుప్పం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం అయిన తర్వాత గ్రామాల్లో సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. మండల పరిధి 89పెద్దూరు గ్రామంలోని తాగునీటి బోరులో జలాలు తగ్గిపోయి సుమారు రెండేళ్లుగా అక్కడ తాగునీటి సమస్య నెలకొంది. బోరులో ఉన్న జలాలు గ్రామంలో కొంతమేర మాత్రమే అందేవి. స్థానికులు పలుసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతులిచ్చినా ఫలితం లేకపోయింది. అలాగే బల్ల పంచాయతీ లక్ష్మీనగర్ గ్రామంలోనూ తాగునీటి సమస్యతో ప్రజలు, అక్కడి కాళియమ్మ ఆలయానికి వచ్చే భక్తులు అసౌకర్యానికి గురయ్యేవారు. రెండు గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను స్థానిక నేతలు ఇటీవల మండల స్థాయి నేతలు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ , కడ పీడీ వికాస్‌మర్మత్‌ల దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే స్పందించి ఆ గ్రామాలకు కొత్త బోర్లను మంజూరు చేశారు. ఆదివారం రెండు గ్రామాల్లో బోర్ల తవ్వకాలను ప్రారంభించారు. లక్ష్మీనగర్‌లో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి నాగభూషణం, 89పెద్దూరులో పార్టీ పంచాయతీ అధ్యక్షుడు లోకేశ్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు అమాను, నాగభూషణం, వేణు, బాబు, రాజేంద్ర, శ్రీనివాసులు, బాలసుబ్రహ్మణ్యం, నాగరాజు, శంకర్, హనుమంతు, హరిప్రసాద్, అశ్వత్ పాల్గొన్నారు.

బాలమురుగన్ ఆలయ ధర్మకర్త భార్య మృతి


నాగమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పాలరేవుగడ్డలోని బాలమురుగన్ దేవాలయ ధర్మకర్త మునస్వామిగౌండర్ భార్య నాగమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి స్థానిక నేతలతో కలిసి నాగమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మునస్వామిగౌండర్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నేతలు నాగభూషణం, జయశంకర్, మునిరత్నం, బాలసుబ్రహ్మణ్యం, ఎర్రప్ప, హనుమంతు, శ్రీనివాసులు, శంకర్, పెరియప్ప తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణ మండపానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాత సాంబయ్య

సోమల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలోని స్వయంభేశ్వర స్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మాణంలోని శివపార్వతుల కల్యాణ మండపానికి వరదం సాంబయ్య, పద్మావతమ్మ దంపతులు రూ.50,116 విరాళంగా అందజేశారు. ఆదివారం ఆలయంలో పూజలు చేపట్టి దాతలకు తీర్థప్రసాదాలు అందించి సన్మానించారు. అలాగే కల్యాణ మండపానికి సీసీ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసిన టీడీపీ పట్టణ అధ్యక్షుడు పీవీ శివశంకర్‌ను ఆలయ నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బీవీ సోమశేఖర్, వరదం వెంకటరమణ, వరదం ప్రసాద్, టీవీ రమణ, చెన్నకేశవులు, రామసిద్దులు, ఆలయ అర్చకులు విద్యాసాగర్, రామ్మూర్తి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

తుప్పు వదిలించరూ..!


అటవీశాఖ కార్యాలయం వద్ద తుప్పు పడుతున్న వాహనాలు

పలమనేరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు అటవీశాఖ కార్యాలయం ఆవరణలో పలు వాహనాలు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పు పడుతున్నాయి. అటవీ నేరాల్లో పట్టుబడిన వాహనాలను ఇక్కడి అధికారులు సీజ్ చేసి ఏళ్ల గడుస్తున్నా వాటి గురించి పట్టించుకోకపోవడంతో లక్షలాది రూపాయలు విలువచేసే వాహనాలు పనికి రాకుండా తుప్పుపడుతున్నాయి. ముఖ్యంగా కలప, ఎర్రచందనం అక్రమ రవాణాలో పట్టుబడిన వాహనాలపై ఉన్న నంబర్లపై అధికారులు కేసు నమోదు చేస్తుంటారు. వాస్తవానికి అక్రమ రవాణాకు ఉపయోగించే వాహనాలపై వేసిన నంబర్లు దాదాపు తప్పుడు నంబర్లే. అయితే అక్రమ రవాణాలో పట్టుబడిన వాహనాలను సీజ్‌చేసిన అధికారులు దర్యాప్తును మాత్రం అటకెక్కిస్తున్నారు. ఒక వాహనం అక్రమ రవాణాతో పట్టుబడితే ఆ వాహన యజమాని ఎవరన్నది తేల్చడం పెద్ద కష్టమేమీ కాదు. ఇది కేవలం పలమనేరు అటవీ శాఖకే పరిమితం కాదు జిల్లాలో పలుచోట్ల పోలీసులు, అటవీశాఖ అధికారులకు పట్టుబడే వాహనాల దర్యాప్తు ఈ కోవలోనే సాగి అసలు స్మగ్లర్లు మాత్రం పట్టుబడటం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి పట్టుబడిన వాహనాల వేలం నిర్వహణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కుప్పంలో రేపు సత్యసాయి రథయాత్ర

కుప్పం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో మంగళవారం సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర జరుగుతుందని సంస్థల ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పెనుమూరులో సోమవారం ప్రారంభమయ్యే రథయాత్ర అక్కడి నుంచి అదేరోజు రాత్రి కుప్పం చేరుతుందన్నారు. మరుసటి రోజైన మంగళవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కుప్పంలో సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర వైభవంగా జరుగుతుందని చెప్పారు. రథయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సత్యసాయి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు కడా పీడీ గ్రీవెన్స్ డే

కుప్పం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల సచివాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. ఇందులో అర్జీదారుల సమస్యలను విని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మేలైన పశుగ్రాసంతో అధిక దిగుబడి

రొంపిచెర్ల, జూలై 13(ఆంధ్రజ్యోతి): మేలైన పోషకాలు ఉన్న పశుగ్రాసాన్ని పాడి ఆవులకు మేతగా అందిస్తే పాడి రైతులు అధిక పాల దిగుబడులు పొందొచ్చని పశు సంవర్థకశాఖ ఏడీ శ్రీనివాసులు నాయుడు అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రొంపిచెర్ల, పులిచెర్ల, సదుం, సోమల మండలాలకు చెందిన పాడి రైతులు ధాన్యపు జాతి, పప్పుజాతి గ్రాసాలను 3:1 నిష్పత్తిలో పశువులకు అందించాలన్నారు. పెయ్యదూడల ఉత్పత్తి పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలు క్రమం తప్పకుండా వేయాలని తెలిపారు.

అలరించిన త్యాగరాజ సంకీర్తన


కళామందిరంలో త్యాగరాజ సంకీర్తన

గంగవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కళామందిరంలో నిర్వహించిన త్యాగరాజ సంకీర్తన కచేరి విశేషంగా ఆకట్టుకుంది. ఆదివారం తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు ఆధ్వర్యంలో గంగవరంలోని సాయినగర్‌లో త్యాగరాజ సంకీర్తన కచేరి నిర్వహించారు. కర్ణాటకకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు సాయితేజస్ చంద్రశేఖర్(గానం), అర్జున్ దినకర్ (వయోలిన్), జి.యస్.నాగరాజు (మృదంగం), చంద్రశేఖర్ (ఘటం)లు సంయుక్తంగా చేసిన కచేరి చూపరులను కనువిందు చేసింది. తులసీనాథం నాయుడు మాట్లాడుతూ సంగీతానికి తెలుగుభాష అనువైందని.. భాషను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ధనంజయ, రాఘవేంద్ర, ప్రణమ్య, సాయి తేజశ్విని, రజని, హరిత, విద్య, నవీన్, శ్రీపురం సీతారామయ్య, ఉమామహేశ్వరరెడ్డి, దేవేంద్ర, బాలసుందరం, సంస్థ కార్యదర్శి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛను విధానాన్ని అమలు చేయాలి


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు


పుంగనూరు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57 ప్రకారం పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని ఎస్టీయూ చిత్తూరు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఉపాధ్యాయులు తమ కుటుంబ సభ్యులతో కలిసి గృహదీక్షలు చేపట్టారు. ఈనెల 18న చిత్తూరు కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కాబట్టి ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కంటి శస్త్రచికిత్సకు 16 మంది ఎంపిక


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సదుం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉచిత కంటి శస్త్ర చికిత్సలకు 16 మందిని ఎంపిక చేసినట్లు శిబిరం నిర్వాహకులు చైర్మన్ రామచంద్ర తెలిపారు. ఆదివారం స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి సుమారు 100 మంది హాజరు కాగా 16 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసి తిరుపతికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో అధ్యక్షులు కృష్ణమూర్తి, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బోయకొండపై ట్రాఫిక్



చౌడేపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండపై అధికారులు, పోలీసుల నిర్లక్ష్యం.. ముందస్తు చర్యలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం బోయకొండ కింద నుంచి పైకి వరకు కార్లు, వివిధ వాహనాలతో రోడ్డు పూర్తిగా నిండిపోయి ట్రాఫిక్ నెలకొంది. ఈ ఏడాది ఎన్నడూ లేనివిధంగా భక్తులు బోయకొండ గంగమ్మ తల్లి దర్శనార్థం రావడంతో తీవ్ర ఇబ్బందుల పడ్డారు. కండిషన్ లేని వాహనాలు సైతం కొండపైకి అనుమతించడంతో రోడ్డుపైనే మొరాయించడంతో ట్రాఫిక్ మరింత ఎక్కువగా మారింది. కొండకు వెళ్లే రోడ్డుపై సుమారు 2 కిలోమీటర్లు వరకు కార్లతో నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అయినా పోలీసుల చర్యలు నామమాత్రంగా ఉండటం.. రోడ్డు డివైడర్‌పైనే కూర్చొని సేదదీరడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ సమస్యపై ఈవో ఏకాంబరంను వివరణ కోరగా పోలీసులు చూసుకోవాలని తెలిపారు. పార్కింగ్ స్థలం చూపించకపోవటం, కొండపై పార్కింగ్‌కు తగినంత స్థలం లేకపోవటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

అభివృద్ధి ప్రదాత చంద్రబాబు


కుప్పం : కంగుందిలో కరపత్రాలు పంచుతున్న పీఎస్ఎం తదితరులు


రామకుప్పం మండలం మిట్టపల్లెలో కరపత్రాలు పంచుతున్న నాయకులు

కుప్పం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమ ప్రదాత అని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. ఆయన ఆదివారం కుప్పం పురపాలక సంఘం, మండల పరిధిలో జరిగిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రత్యేకించి తన సొంత గ్రామమైన కంగుందిలోని 145వ బూత్ పరిధిలో ఇంటింటికీ తిరిగి ఏడాది ఎన్డీయే పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముద్రించిన కరపత్రాలు పంచిపెట్టారు. ఆయా పథకాల గురించి ప్రజలకు వివరించారు. ముఖ్యంగా కుప్పం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే చంద్రబాబు అధికారంలో ఉండి తీరాలన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** రాష్ట్రంలో ఏడాది చంద్రబాబు పాలనపై ప్రజల్లో సర్వత్రా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి తెలిపారు. మండల పరిధి మిట్టపల్లెలోని 69వ బూత్‌లో ఆదివారంతో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం పూర్తయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి జాడే లేకపోయిందని, సంక్షేమ ఫలాలు కొందరికే పరిమితమయ్యాయన్నారు. విసిగి వేసారిన ప్రజలు రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీకి బుద్ధి చెప్పి, తమ బతుకులు మారతాయన్న ఆశతో కూటమికి భారీ మెజారిటీతో ఘనవిజయాన్ని అందించారన్నారు. కార్యక్రమం క్లస్టర్ కో-ఇన్‌చార్జి నవీన్, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, బూత్ కన్వీనర్ చలపతి, నేతలు లక్ష్మీనారాయణరెడ్డి, సాహిత్‌రెడ్డి, మంజు, సుబ్బన్న, కేశవరెడ్డి, సుబ్రహ్మణ్యం, సురేంద్ర, నరేశ్, అశోక్, నందప్ప తదితరులు పాల్గొన్నారు.

● పీఎంకేతాండా, పంద్యాలమడుగు పంచాయతీల పరిధిలో ఆదివారం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాల్లో టీడీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, తెలుగు యువత మండలాధ్యక్షుడు విశ్వనాథ్, చంద్రబాబునాయక్, పార్థసారథి పాల్గొన్నారు.

వి.కోట లయన్స్ క్లబ్ కార్యవర్గం ఎంపిక


నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న లయన్స్ క్లబ్ పెద్దలు

వి.కోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వి.కోట నూతన కార్యవర్గాన్ని జిల్లా మాజీ గవర్నర్ చంద్రారెడ్డి నేతృత్వంలో ఎంపిక చేశారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన లయన్స్ క్లబ్ కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమంలో నూతన అధ్యక్షులుగా డా.తమీంఖాన్, కార్యదర్శిగా ఇంద్రేష్‌యాదవ్, కోశాధికారిగా ఎస్‌ఏ సాదాత్‌లను ఎంపిక చేశారు. వి.కోట పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న లయన్స్ క్లబ్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది చదువులో ఉత్తమ ప్రదర్శన కనబరచిన విద్యార్థులకు ఉపకార వేతనాలు చెల్లించారు. కార్యక్రమంలో భాను మూర్తిరెడ్డి, చంద్రారెడ్డి, భాస్కర్, రాజారెడ్డి, జీఈటీ సభ్యులు సురేంద్రగౌడ, జడ్పీ ధీరజ్, గంగాధర్, దశరథరెడ్డి, సీఐ సోమశేఖర్‌రెడ్డి, సభ్యులు మురుగేష్, లక్ష్మణ్, తుకారం, దామోదర్‌రెడ్డి, నాగభూషణం, నాగరాజేంద్ర, రంగనాథ్, బాలగురునాథ్, లాబూరాం, కృష్ణమూర్తి, దవనం భక్తా, తదితరులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ సేవలు విస్తృతం చేయాలి


రోటరీక్లబ్ అధ్యక్షుడిగా గణేశ్ ప్రమాణస్వీకారానికి విచ్చేసిన ప్రతినిధులు

పుంగనూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు రోటరీ క్లబ్ సేవలను విస్తృతం చేసి ఆదర్శంగా తీసుకురావాలని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ హరినీరవీంద్రనాథ్, సెక్రటరీ ఎం.హేమచంద్ర, జోన్ చైర్మన్ చైతన్య పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి స్థానిక ఓ కల్యాణ మండపంలో నూతన రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా నాన బాల గణేశ్, కార్యదర్శి రాజారెడ్డి, సభ్యుల ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రోటరీక్లబ్ చేపట్టిన సమాజ సేవా కార్యక్రమాలు గురించి వివరిస్తూ సేవలను నూతన కార్యవర్గం మరింత పెంచాలని సూచించారు. అధ్యక్షుడు గణేశ్ మాట్లాడుతూ 2025-2026 రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, కంటివైద్య శిబిరాలు, వెటర్నరీ క్యాంపులు, హెల్త్ క్యాంపులు, పర్యావరణ పరిరక్షణతోపాటు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు అందరి సహకారంతో చేపట్టడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శరణ్‌కుమార్, పూలత్యాగరాజు, ఆవుల హరిప్రసాద్, డాక్టర్ విజయకుమారి, అనీల్, భాస్కర్‌శెట్టి, పట్టణ ప్రముఖులు డాక్టర్ శివ, డాక్టర్ సరళ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం పేరుతో మోసం: పెద్దిరెడ్డి


పుంగనూరులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు ప్రయాణం పేరుతో మహిళలను మోసం చేశారని.. ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. ఆదివారం బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పుంగనూరులో వైసీపీ శ్రేణులతో సమావేశాన్ని నిర్వహించి సీఎం చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తు చేస్తూ ఏర్పాటు చేసిన స్కానర్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, రాష్ట్ర వైసీపీ కార్యదర్శి ఎన్.అనీషారెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

●**చౌడేపల్లె:** సీఎం చంద్రబాబునాయుడు హామీలు చెబుతారని.. అమలు చేయరని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం చౌడేపల్లెలో వైసీపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. మాజీ టీటీడీ సభ్యులు అశోక్, కాలువ శ్రీనాథ్‌రెడ్డి, వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణరెడ్డి, జడ్పీటీసీ దామోదర్‌రాజు, సుధాకర్‌రెడ్డి, కిశోర్, శంకర్‌నారాయణ, రుక్మిణమ్మ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

● **సోమల:** కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే పరిస్థితి లేదని పెమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం సోమలలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నాయకులు మోహన్, గంగాధరం, నాగేశ్వరరావు, ప్రభాకర్, సాంబశివయ్య, హరినాథ్, ఝాన్సీలక్ష్మీ, మురళీ, కిరణ్, ఈశ్వర్, కోదండరాజు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

రామకుప్పం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె సమీపంలోని బహిరంగ ప్రదేశంలో పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. చెల్దిగానిపల్లె వద్ద కొందరు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దాడులు నిర్వహించిన పోలీసులు ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి నుంచి రూ.16,300 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటమోహన్ తెలిపారు.

ఇద్దరు పేకాటరాయుళ్ల అరెస్టు

గంగవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు. వారి నుంచి రూ.1400 స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రామకుప్పం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పోలీసులు ఆదివారం కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన వ్యక్తిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... రామకుప్పం-రాజుపేటక్రాస్ రహదారిలో మిట్టపల్లె వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ ఆటోలో అనుమానాస్పదంగా కూర్చున్న తమిళనాడు రాష్ట్రం వాణియంబాడికి చెందిన శివకుమార్(39)ను తనిఖీ చేయగా అతని వద్ద కర్ణాటక మద్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటమోహన్ తెలిపారు.

ముగిసిన నృత్య ప్రదర్శనల సెమీస్ పోటీలు



చిత్తూరు కల్చరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ భవన్‌లో ఆదివారం మాదిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనల ధారా వాహిక పోటీలలో భాగంగా ఆదివారం సెమీఫైనల్ పోటీలు జరిగాయి. ఈ ప్రదర్శనల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో 15 మంది చొప్పున ప్రీ ఫైనల్స్‌కు ఎంపికచేశారు. ఈనెల 20వ తేదీ ప్రీ ఫైనల్స్, 28న ఫైనల్స్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో విజయసింహా రెడ్డి, రాజరత్నంరెడ్డి, న్యాయనిర్ణేత కోడి కిషోర్, నృత్య కళాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కాగా ఒక్కో విభాగంలో 10 మందిని ఎంపిక చేయాల్సి ఉండగా నిర్వాహకుల సమన్వయలోపంతో 15 మందిని ఎంపిక చేయాల్సి వచ్చింది.

పలువురికి అన్నదానం

చిత్తూరు సెంట్రల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య స్కూల్ వ్యవస్థాపకులు బీఎస్‌రావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆ స్కూల్ యాజమాన్యం అన్న దానం చేసింది. ఈ కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకులు ఏజీఎం సురేష్, ఇన్‌చార్జి చక్రధర్, సాగరిక, రేఖ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. వెంకటరమణుడి కల్యాణం


అలంకరణలో కల్యాణ వెంకటరమణస్వామి

పుంగనూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి వారి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. టీటీడీ ఆధ్వర్యంలో అర్చకులు శ్రీవారు, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు, పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఆలయంలో శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయదారులుగా బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ కుటుంబం వ్యవహరించింది. కార్యక్రమాల్లో ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, లక్ష్మీకాంత్ స్వామి, భక్తులు, పట్టణ ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నెల్లిమందలో పాలేటమ్మ జాతర ప్రారంభం

సోమల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే నెల్లిమంద జాతర వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గత 20 ఏళ్లుగా అమ్మవారి జాతరను ఏడాదిలో రెండు పర్యాయాలు జరుపుకోవడం ఆనవాయితీ. కలికిరి ఎల్లమ్మ జాతర అనంతరం జాతర నిర్వహిస్తారు. ఈక్రమంలోనే ఎగువ గొల్లపల్లెలో జాతర వేడుకలు సంప్రదాయం ప్రకారం మొదటి పూజ అర్చకులు పాలేటి ఆధ్వర్యంలో జరిగాయి. అలాగే గ్రామోత్సవాలు ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు నెల్లిమంద, సోమల పంచాయతీల్లోని 12 గ్రామాల్లో అమ్మవారి ఉత్సవమూర్తిని, పోతురాజును ఊరేగించనున్నారు. 20, 21 తేదీల్లో ఆలయం వద్ద జాతర నిర్వహించనున్నారు.

వైభవంగా మాతమ్మ కొలుపు


మాతమ్మ ఆలయానికి బోనాలతో మహిళలు

రొంపిచెర్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ నగిరి హరిజనవాడలో ఆదివారం మాతమ్మ కొలుపు వైభవంగా జరిగింది. ఆలయాన్ని పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారిని పసుపు, కుంకుమతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు బోనాలు, పూజాసామగ్రితో ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంపూర్ణ, పుంగనూరు నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు సహదేవ, నాయకులు రాజన్న, ఓబులేశ్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

కీలపట్లలో ఘనంగా గంగజాతర



గంగవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కీలపట్ల గ్రామంలో తిరుపతి గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి గంగమ్మతల్లి శిరస్సు ఊరేగింపును గ్రామంలోని పురవీధుల్లో నిర్వహించారు. ఆదివారం వేకువజామున భక్తుల దర్శనార్థం గ్రామంలోని నడివీధిలో కొలువుదీర్చారు.

దంచి కొట్టిన వర్షం.. నగరం జలమయం




మిట్టూరులో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీటిలో తడచుకుంటూ వెళ్తున్న వాహనదారులు, యంఎస్‌ఆర్ జంక్షన్‌లో ప్రవహిస్తున్న నీరు

చిత్తూరు కల్చరల్, జూలై13(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం రాత్రి సుమారు గంటన్నరపాటు భారీ వర్షం దంచి కొట్టింది. నగరంలోని మురుగు కాల్వలు పొంగి పొర్లాయి. నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారాంతపు ఆట విడుపైన ఆదివారం అకస్మిక వర్షం పడటంతోసి సినిమాలకు, బజార్లకు వెళ్లిన ప్రజలు తిరిగి ఇళ్లకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆటోవాలాలు రెండింతలుగా చార్జీలు వసూలు చేశారు. మురుగు కాల్వలోని మురుగు నీరు రోడ్లపై ప్రవహించడంతో నగరం అపరి శుభ్రంగా తయారైంది. చాలా వరకు కాలువలు చెత్తాచెదారంతో పేరుకుపోయాయి.

అశ్వవాహనంపై కోదండరాముడి అభయం



తవణంపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.పుత్తూరు కోదండ రామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కోదండ రాముడు అశ్వ వాహనంపై ఊరేగారు. అర్చకులు ఉదయం స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయం త్రం ఉత్సవమూర్తులకు ఉంజల్‌సేవ నిర్వహించి అశ్వ వాహనంపై మేళ తాళాల నడుమ టి.పుత్తూరు పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సిద్దేశ్వరరెడ్డి, ఉభయ దారులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వజ్రోత్సవాలను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న సీతాపతినాయుడు

ఐరాల, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలను విజయవంతం చేద్దామని పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు సీతాపతినాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం పాఠశాలలో కొంత మంది పూర్వ విద్యార్థులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పాఠశాల 75 సంవత్సరాలను పూర్తి చేసుకున్న సందర్భంగా మనం వజ్రోత్సవాలను నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. త్వరలోనే తేదీని ప్రకటిస్తామని వివరించారు.

చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి



ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నింద్ర, జూలై 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సంక్షేమంతో పాటు అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తెలియ జేశారు. ఆదివారం మండలంలోని అత్తూరు మంగళగిరి కండ్రిగ పంచాయతీలలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధిని వివరించే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంధమనేని రాజేష్, విజయ్ కుమార్, గిరి, గాలి రమేష్‌నాయుడు, పురుషోత్తంనాయుడు, మురళీనాయుడు, రాము, రాధాకృష్ణ, గిరినాయుడు పాల్గొన్నారు.

18 నుంచి ఆడిమాస శుక్రవారాలు

చిత్తూరు కల్చరల్, జూలై13(ఆంధ్రజ్యోతి): నగరంలోని గుర్రప్పనాయుడు వీధి అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 18 నుంచి ఆగస్టు 15 వరకు ఆడి (తమిళ ఆషాఢ మాసం) మాస శుక్రవారాలు ప్రారంభం కానున్నాయని ఆలయ నిర్వాహకులు కెఎం. కుమార్, అర్చకులు బి.కుమార్‌లు తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 18న మొదటి 25న రెండవ, ఆగస్టు 1న మూడవ, 8న నాల్గవ, 15న చివరి ఐదవ శుక్రవార పూజలను అమ్మవారికి విశేషంగా నిర్వహించనున్నట్లు వివరించారు. ఆగస్టు 8వ తేదీ వరలక్ష్మి వ్రతం నిర్వహించనున్నామని, వ్రతంలో పాల్గొనే భక్తులు, దంపతులు తమ పేర్లను అర్చకుల వద్ద నమోదు చేసుకోవాలని కోరారు.

ముగిసిన నృత్య ప్రదర్శనల సెమీస్ పోటీలు



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారిణి

చిత్తూరు కల్చరల్, జూలై13(ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ భవన్‌లో ఆదివారం మాదిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనల ధారావాహిక పోటీలలో భాగంగా ఆదివారం సెమీఫైనల్ పోటీలు జరిగాయి. ఈ ప్రదర్శనల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో 15 మంది చొప్పున ప్రీ ఫైనల్స్‌కు ఎంపికచేశారు. ఈనెల 20వ తేదీ ప్రీ ఫైనల్స్, 28న ఫైనల్స్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో విజయసింహా రెడ్డి, రాజరత్నంరెడ్డి, న్యాయనిర్ణేత కోడి కిషోర్, నృత్య కళాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కాగా ఒక్కో విభాగంలో 10 మందిని ఎంపిక చేయాల్సి ఉండగా నిర్వాహకుల సమన్వయలోపంతో 15 మందిని ఎంపిక చేయాల్సి వచ్చింది.

ఆ పాత మధురాలు

- 35ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు
- గంగాధరనెల్లూరు హైస్కూల్లో ఆత్మీయ కలయిక



గంగాధరనెల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చాలా సంవత్సరాల తర్వాత ఒకరికొకరు కలిశారు .. వారందరూ పాతజ్ఞాపకాలను పంచుకున్నారు. నేటి అనుభవాలను చర్చించుకుని సందడి చేశారు. గంగాధరనెల్లూరు హైస్కూల్లో 1990-91లో చదివిన పూర్వ విద్యార్థులందరి అపూర్వ కలయికకు ఆదివారం అదే పాఠశాల వేదికైంది. ఈ ఆత్మీయ సమావేశానికి అప్పటి గురువులైన గుర్రప్పనాయుడు, యాగమూర్తిపిళ్లై, బాలక్రిష్ణ పిళ్లై, శారదమ్మ, లలితమ్మ, గోపిరెడ్డి, రమణి, తులసీరామ్, ముస్తాఫాలకు పూర్వవిద్యార్థులు శాలువలు కప్పి, పూలమాలలు వేసి సన్మానం చేశారు. పలువురు రిటైర్డ్ టీచర్లు మాట్లాడుతూ 35ఏళ్ల తర్వాత అప్పటి పదో తరగతి విద్యార్థులు గురువులను సన్మానం చేసి గౌరవించడం ఆనందంగా ఉందన్నారు. ఉన్నతస్థాయికి వెళ్లిన విద్యార్థులు తాము చదువుకున్న హైస్కూల్లో పేద విద్యార్థులకు, హైస్కూల్ పురోభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తాము చదువుకున్న హైస్కూల్‌కు తమవంతు చేయూత అందించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆరిమాని గంగమ్మకు ప్రత్యేక పూజలు

శ్రీరంగరాజపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం మండలం ఆరిమాని గంగమ్మకు ఆదివారం భక్తులు విశేష పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అర్చకులు వెంకటా చలపతి భక్తులకు ప్రసాదం అందజేశారు.

నేడు నగరపాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్

చిత్తూరు అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరు కావాలని ఆదేశించారు.

నారా లోకేశ్‌ను కలిసిన పైనేని మురళి

శ్రీరంగరాజపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్ పురం మండలం విలాసవరహాపురం గ్రామ పంచాయతీ గంగమ్మగుడి గ్రామానికి చెందిన టీడీపీ యువ నేత పైనేని మురళి శనివారం నారా లోకేష్‌ను అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిశారు.

అక్కగార్లకు ప్రత్యేకపూజలు



ఊరేగింపుగా బయలుదేరిన గ్రామస్తులు

గంగాధరనెల్లూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): శాలివాహన వంశస్థుల ఆధ్వర్యంలో గంగాధరనెల్లూరులో అక్కగార్లు, గుర్రప్పస్వామిలకు వార్షిక పూజలు ఘనంగా నిర్వహించారు. పిల్లనగ్రోవి, పంబల వాయిద్యాల నడుమ గంగాధరనెల్లూరు నుంచి సురేంద్రరెడ్డి మామిడితోపువరకు ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ అక్కగార్లకు, అల్లియెల్లమ్మకు, మునీశ్వరస్వామిలకు పూజలు చేశారు.

బంగారమ్మకు రూ1.36 లక్షల ఆదాయం



హుండీ లెక్కింపు

వెదురుకుప్పం, జూలై 13(ఆంధ్రజ్యోతి): కార్వేటి నగరం గ్రామ దేవత బంగారమ్మ ఆలయ హుండీ లెక్కింపు ఆదివారం జరిగినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు కొప్పేటి ప్రసాద్ తెలిపారు. రూ.1.36 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు సన్మానం



నింద్ర, జూలై 13(ఆంధ్రజ్యోతి): నింద్ర సింగిల్ విండో చైర్మన్ గా ఎంపికైన వెంకటేశ్వరరావును నింద్ర మండల టీడీపీ నాయకులు ఆదివారం ఆయన స్వగ్రామంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రైతులకు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు, సన్మానించినా వారిలో నాయకులు రవినాయుడు, ఓంప్రకాష్, బాబుయాదవ్, ప్రసాద్ రెడ్డి, గాలి రమేష్‌నాయుడు, మురళీనాయుడు, విజయ్‌కుమార్, మనోజ్‌యాదవ్, మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ ఆలయ కుంభాభిషేకం



ఆలయంలో పూజలు నిర్వహిసుస్తున్న టీడీపీ నాయకులు

పాలసముద్రం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలకృష్ణాపురం ఆదిఆంధ్రవాడలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో ఆదివారం కుంభాభిషేకం వేడుకలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శనివారం రాత్రి గంగమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అంతకుముందు యాగశాలలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగశాలలోని కలశాలలోని కుంభ జలాన్ని తీసుకొచ్చి ఆలయ గోపురం పోసి కుంభాభిషేకాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడు, టీడీపీ జిల్లా కార్యదర్శి వాసునాయుడు, నాయకులు జేవీ.జయ్‌కుమార్, వాసుయాదవ్, కోదండనాయుడు, సుధాకర్‌నాయుడు, శ్రీనునాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి: భానుప్రకాష్



ముడిపల్లిలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, జూలై13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్ర బాబుతోనే సాధ్యమని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం 'సుపరి పాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా నగరి మండలంలోని ముడి పల్లిలో ఆయన ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్లిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇపుడిపుడే గాడిలో పడుతోందన్నారు. ఉచిత గ్యాస్, తల్లికి వందనం, పెన్షన్ పెంపు ఇప్పటి వరకు పూర్తి చేశామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పి స్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, కార్యదర్శి వేణు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, నాయకులు పరంధామ నాయుడు, గిరినాయుడు, బాబునాయుడు, ధనంజయలు, బీవీ.నాయుడు, దేవరాజులు, గోవిందస్వామి, నాగరాజు, ప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వాన కోసం వేరుశనగ రైతుల ఎదురుచూపులు



వర్షాభావం కారణంగా దాసరాపల్లి వద్ద సరిగ్గా మొలకెత్తని వేరుశనగ

యాదమరి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ అదును దాటుతున్నా ... వాన రాకకోసం వేరుశనగ విత్తనాలు వేయడానికి యాదమరి మండలంలో రైతన్నలు ఎదురుచూపులు తప్పడంలేదు. సాధారణంగా జూన్, జూలై నెలల్లో నైరుతి రుతుపవనాలు ప్రభావం చూపుతాయి. నెల రోజులుగా వాన మొహం చాటేయడంతో పగటిపూట అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఖరీఫ్‌లో మండల పరిధిలో గత ఏడాది 1500 హెక్టార్లలో వేరుశనగ పంట వేయగా, ఈసారి వారిలో సగం మంది కూడా వేసే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. కాగా ఈ సంవత్సరం జూన్ నెలలో ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు సరఫరా చేయగా రైతులు వాటిని విత్తేందుకు సిద్ధం చేశారు. తీవ్ర వర్షాభావం కారణంగా పంట వేయలేక, మరోపక్క వర్షం కురుస్తుంది అని వేసిన వారు విత్తనం మొలకెత్తక ఆందోళన చెందుతున్నారు.

- జూలై చివరి వరకు అనుకూలం



వర్షం సకాలంలో పూర్తి స్థాయిలో కురవకపోవడంతో వర్షాధార పంటలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వేరుశనగ ఈ నెలాఖరు వరకు వేయడానికి అనుకూలం. నీటి మీద ఆధారపడే రైతులు వేరుశనగ విత్తనాలు వేసుకోవచ్చు.

\- ఏవో దీప

పలువురికి అన్నదానం

చిత్తూరు సెంట్రల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య స్కూల్ వ్యవస్థాపకులు బీఎస్‌రావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆ స్కూల్ యాజమాన్యం అన్న దానం చేసింది. ఈ కార్యక్రమంలో స్కూల్ నిర్వహకులు ఏజీఎం సురేష్, ఇన్‌చార్జి చక్రధర్, సాగరిక, రేఖ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు బాబు పాలనలోనే మహర్దశ

- టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్



చిత్తూరు అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మామిడి రైతులకు సీఎం చంద్రబాబు పాలనలోనే మహర్దశ వస్తుందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మామిడి పంట దిగుబడి పెరగడానికి ముఖ్యమంత్రిగా ఆయన అమలు చేసిన రైతు సంక్షేమ పథకాలే నిదర్శనమన్నారు. మామిడి రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి గిట్టుబాటు ధరను ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది కిలోకు అదనంగా రూ.4 అందించి సహకరిస్తోందన్నారు. ఈ ఏడాది పంట దిగుబడి అధికంగా వచ్చేయడంతో ఫ్యాక్టరీల యజమానులు కొనుగోలుకు ముందుకురాకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురికాగా వాటిని సైతం అధికారులతో చర్చించి రైతులకు న్యాయం చేసిన ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కిందన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



యాదమరి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): యాదమరిలోని శ్రీవిష్ణుప్రియ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 1994 - 1995వ బ్యాచ్ పూర్వవిద్యార్థులు మూడు దశాబ్దాల తరువాత ఆదివారంఆత్మీయ సమావేశం నిర్వహించారు. విద్యార్థులు మధుర జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులతో సంతోషంగా గడిపారు. ఈ సమావేశంలో నాటి ప్రధానోపాధ్యాయులు సంపత్, ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కుప్పుస్వామి, అప్పటి గురువులు గణపతి, వేణుగోపాల్, రోహిణి, వసంత, కౌసల్యలను ఘనంగా సన్మానించారు. పాఠశాలకు రూ.60 వేలు విలువజేసే వస్తువులు అందజేశారు.

సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం



బాలకృష్ణాపురంలో కర పత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పాలసముద్రం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు నీరజాక్షులునాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని రామకృష్ణాపురం, బాలకృష్ణాపురం తదితర గ్రామాలలో టీడీపీ నాయకులు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కర పత్రాలు పంపిణీ చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, నాయకులు అరుణ్‌నాథన్, సాంబశివన్, పురుషోత్తం, పాల్‌రాజ్, వెంకటపతినాయుడు, అమర్‌నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ

- ఆరుగురిపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): టీడీపీలోని ఇరువర్గాల నేతలు ఘర్షణ పడిన సంఘటన శనివారం రాత్రి నగరంలో చోటు చేసుకుంది. ఒకటవ పట్టణ పోలీసుల కథనం మేరకు.. రెండు రోజుల క్రితం నగరంలోని 18వ డివిజన్‌లో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో చిత్తూరు నగర తెలుగు మహిళ అధ్యక్షురాలు వరలక్ష్మీ, అదే వార్డులో మహేష్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించి వేసిన ఫ్లెక్సీలో కొంత మంది నేతలు ఫొటోలు లేవని వరలక్ష్మి, అదే వార్డుకు చెందిన మహేష్ అనుచరుడు విజయ్‌ని అడిగారు. దీనిపై వరలక్ష్మి, మహేష్‌ల అనుచరుల మధ్య మాటా మాటా పెరిగింది. వరలక్ష్మి వర్గానికి చెందిన వారు మహేష్ వర్గానికి చెందిన విజయ్, గంగాధరంలపై దాడి చేశారు. ఈ దాడిలో వారు తీవ్రంగా గాయపడటంతో చీలాపల్లె సీఎంసీకి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి వరలక్ష్మితో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదైంది. అదేసమయంలో మహేశ్వర్‌తో పాటు మరో ఇద్దరిపై వరలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దారి కల్పించండి

- కొత్త ఇండ్లు కాలనీ వాసులు వేడుకోలు

చిత్తూరు రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): తమ కాలనీకి వెళ్లేందుకు దారి లేకుండా నేషనల్ హైవే అధికారులు గుంతలు తవ్వేశారని గువ్వకుల్లు పంచాయతీ కొత్త ఇండ్లు కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం చిత్తూరు రూరల్ మండలం కొత్త ఇండ్లు కాలనీ వాసులు రోడెక్కారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 40 కుటుంబాలకుపైగా ప్రభుత్వం ఇంటి స్థలం మంజూరు చేసిందన్నారు. కూలీపనులు చేసుకుంటూ గూడు కట్టుకున్నామన్నారు. ఈ కాలనీకి రెవెన్యూ, హౌసింగ్ అధికారులు అప్పట్లో దారి చూపించారన్నారు. నేషనల్ హైవే అధికారులు చిత్తూరు -తచ్చూరు రోడ్డుమీదుగా సర్వీసు రోడ్డు ఇస్తామన్నారు. ఇప్పుడు ఉన్నట్టుండి దారి లేదని గుంత తవ్వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించి తమ కాలనీకి దారి వసతి కల్పించేలా చూడాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.




దారి కల్పించాలని రోడెక్కిన గ్రామస్తులు, రోడ్డుపై గుంతలు తవ్వేసిన ఎన్‌హెచ్ అధికారులు

ఎందుకిలా వదిలేశారు?



వెదురుకుప్పం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎందరి ప్రాణాలనో కాపాడిన 108 అంబులెన్స్ వాహనం ఇది. ఎందుకిలా వదిలేశారో అంతుచిక్కని ప్రశ్న. వైసీపీ హయాంలో మరమ్మతులకు గురైన ఈ వాహనాన్ని ఎస్‌ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఇలా వదిలేశారని స్థానికులు చెబుతున్నారు.